సాక్షి
రంగారెడ్డి
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



అనుమతులు ఇప్పించండి

తుక్కుగూడలో మంచి నీటి పైపులైన్ కాలువల తవ్వకానికి అనుమతులు ఇప్పించాలని అధికారులు మంత్రి సబితను కోరారు. 8లో▸



ప్రజాసేవకే రాజకీయాల్లోకి..

ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



నేల క్షీణతతో ముప్పు

నేలక్షీణతను అరికట్టేందుకు కృషి చేయాలని, లేకుంటే జీవకోటికి ముప్పు తప్పదని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ధరణి దరఖాస్తులను క్లియర్ చేయాలి

కలెక్టర్ హరీష్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీష్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కొత్తగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీఓలు, తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా నిర్మిస్తున్న జీపీ భవనాల పెండింగ్ పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ, తహసీల్దార్లకు సూచించారు. గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించాలన్నారు. జీఓ నంబర్ 59 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. తహసీల్దార్లు వారివారి మండలాలలో ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, కలెక్టరేట్ ఏఓ. ప్రమీల రాణి, తహసీల్దార్లు పాల్గొన్నారు

ఉపాధ్యాయులను తిప్పి పంపాలి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్



కొందుర్గు కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ నేతలు

కొందుర్గు: జీవో నంబర్ 317 ప్రకారం వివిధ జిల్లాల నుంచి రంగారెడ్డికి వచ్చిన ఉపాధ్యాయులను మినహాయించి, ఇతరత్ర కారణాలు చూపుతూ జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులను తిరిగి పంపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పౌజ్, స్పెషల్ కేటగిరి వారికి వారు కోరుకున్న స్థానాలను కేటాయించారని, ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వడంతో జిల్లాలోని ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు చెన్నారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, పుష్ప, లక్ష్మానాయుడు, వెంకన్న, బాల్‌రాజ్, వెంకట్ రెడ్డి, జగన్మోహన్‌గౌడ్, మాన్యానాయక్, కుర్మారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

గణేశ్ మండపం వద్ద అపశ్రుతి

కరెంట్ షాక్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

సైదాబాద్: వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా సైదాబాద్ డివిజన్ సాయిరాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అపశ్రుతి చోటు చేసుకుంది. మండపం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా కరెంట్ షాక్ తగలడంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. సాయిరాంనగర్ కాలనీకి చెందిన చిన్న సాయిలు కూలి పనులు చేస్తుంటాడు. ఇద్దరు కూతుళ్లకు వివాహం కావడంతో ప్రస్తుతం భార్య ఇద్దరు కుమారులతో ఉంటున్నాడు. అతని పెద్ద కుమారుడు ఆర్.వర్ధన్‌కుమార్ (17) ఇంటర్ చదువుతుండగా, చిన్న కుమారుడు భరత్‌కుమార్ 8వ తరగతి చదువుతున్నాడు. ప్రతి ఏడాది కాలనీలో ఏర్పాటు చేసే గణేష్ మండపం వద్ద వర్ధన్‌కుమార్ చురుకుగా ఉండేవాడు. ఈ ఏడాది కూడా కాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఈ నెల 18న రాత్రి పూజల్లో పాల్గొన్నాడు. రాత్రి 11 గంటల సమయంలో మండపం పైన కవర్ గాలికి లేస్తుండటంతో దానిని సరి చేయడానికి పూనుకున్నాడు. ఇనుప తీగతో కవర్‌ను కట్టే ప్రయత్నంలో ఉండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న కరెంట్ తీగల వలన వర్ధన్‌కుమార్‌కు షాక్ తగిలింది. అక్కడే ఉన్న స్థానికులు కర్రతో అతడిని వెనుకకు లాగి వెంటనే స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. కానీ అప్పటికే వర్ధన్‌కుమార్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఘటనపై మంగళవారం తండ్రి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ- బస్సు ఆగయా

గ్రీన్‌మెట్రో లగ్జరీ ఏసీ బస్సులను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

- ఈ నెల 23నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి
- దశలవారీగా 525 బస్సుల వరకు ఏర్పాటు
- త్వరలో మరో 25 గ్రీన్ మెట్రో లగ్జరీలు
- ఐటీ కారిడార్లు, ఎయిర్‌పోర్టు మార్గాల్లో పరుగులు



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ

సాక్షి, సిటీబ్యూరో/గచ్చిబౌలి: పర్యావరణహిత ఎలక్ట్రిక్ గ్రీన్‌మెట్రో లగ్జరీ ఏసీ బస్సులు రోడ్డెక్కాయి. బుధవారం రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో కలిసి గచ్చిబౌలి స్టేడియంలో ఈ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 25 గ్రీన్‌మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌లకు, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నవంబర్ నాటికి మరో 25 బస్సులను ప్రవేశపెట్టనున్నారు. దశలవారీగా మరో 8 నెలల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో 525 పర్యావరణహిత ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. నిర్వహణ దృష్ట్యా ఎలక్ట్రిక్ బస్సులు ఆర్థికంగా భారమే అయినా నగరంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రవాణా సదుపాయాన్ని అందజేసేందుకు ఆర్టీసీ కృషి చేస్తోందన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు మహర్దశ..

రాష్ట్రంలో ప్రస్తుతం 10 వేలకు పైగా ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు నమోదయ్యాయని మంత్రి చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పర్యావరణహిత నగరం కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఎంతో తపన పడుతున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నా ప్రజల బాగు కోసం ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను అందిస్తోందని చెప్పారు. ఆర్టీసీ బస్సులను మెట్రోతో అనుసంధానం చేసి ఒకే కార్డుపై మెట్రో, ఆర్టీసీ, ఓలా, ఉబెర్‌లో ప్రయాణించే విధంగా చర్యలు తీసుకుంటే సొంత వాహనాల వాడకం తగ్గుతుందని మంత్రి సూచించారు. 2014లో 71 లక్షల వాహనాలు ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య కోటి 52 లక్షలకు పెరిగిందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కారణంగా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. రానున్న రెండేళ్లలో 1800 బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో ఒలెక్ట్రా సీఎండీ ప్రదీప్, ఎస్‌సీఎస్‌సీ సెక్రెటరీ రమేష్, వర్సూసా సెంటర్ హెడ్ కృష్ణ ఏదుల పాల్గొన్నారు.

గ్రీన్ మెట్రో లగ్జరీ ప్రత్యేకతలివీ..

- 12 మీటర్ల పొడవు కలిగిన గ్రీన్ లగ్జరీ ఏసీ బస్సుల్లో అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 225 కిలోమీటర్లు ప్రయాణించే సదుపాయం ఉంటుంది. కేవలం 3 నుంచి 4 గంటల్లో వంద శాతం చార్జింగ్ అవుతుంది.
- క్యాబిన్, సెలూన్‌లో రెండు చోట్ల ఒక నెల బ్యాకప్ సదుపాయం కలిగిన సెక్యూరిటీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
- 35 సీట్ల సామర్థ్యం గల ఈ బస్సుల్లో ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సౌకర్యంతో పాటు రీడింగ్ ల్యాంప్‌లను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికుల భద్రత దృష్ట్యా వెహికిల్ ట్రాకింగ్ సిస్టంతో పాటు ప్రతి సీటు వద్ద పానిక్ బటన్ ఉంటుంది.దీ న్ని ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు.
- బస్సు రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా,ముందు, వెనక, ఎడమ వైపు ఎల్‌ఈడీ బోర్డులు, వాటిపై గమ్య స్థానాల వివరాలు ఉంటాయి.
- అగ్ని ప్రమాదాలను గుర్తించి నివారించేందుకు ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం (ఎఫ్‌డీఎస్‌ఎస్)తో పాటు ప్రయాణికులకు సమాచారం చేరవేసేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఉంటుంది.

ఈ రూట్‌లలో తిరుగుతాయి

సర్వీస్ నంబర్	రూట్	బస్సుల సంఖ్య
195 డబ్ల్యూ	వేవ్‌రాక్-బాచుపల్లి	5
10 హెచ్‌డబ్ల్యూ	సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్/కొండాపూర్	10
ఏజే	మియాపూర్ క్రాస్ రోడ్ నుంచి ఎయిర్‌పోర్ట్(జేఎన్‌టీయూ మీదుగా)	5
ఏఎల్	జేబీఎస్ నుంచి ఎయిర్‌పోర్ట్ (ఎల్‌బీనగర్ మీదుగా)	3
ఏపీ	జేబీఎస్ నుంచి ఎయిర్‌పోర్ట్ (పంజగుట్ట మీదుగా)	2

కన్నబిడ్డ బతకడనే..

- నిలోఫర్‌లో ఆరు నెలల బాలుడి కిడ్నాప్
- అపహరణ కోసమే ఆస్పత్రికి వచ్చిన మహిళ
- తన కుమారుడిని ఆస్పత్రిలోనే వదిలేసి ఉడాయింపు
- బాన్సువాడలో టాస్క్‌ఫోర్స్ టీమ్ రెస్క్యూ
- ఎట్టకేలకు లభించిన చిన్నారి ఆచూకీ
- నిందితులపై మానవత్వం కనబర్చిన పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నిలోఫర్ ఆస్పత్రి నుంచి గత గురువారం అపహరణకు గురైన ఆరు నెలల బాలుడి ఆచూకీ దొరికింది. బాన్సువాడలో ఆ చిన్నారికి రెస్క్యూ చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధ్య మండల డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ వ్యవహారంలో అమ్మా, నాన్న అని పిలిపించుకోవాలనే మమకారం తప్ప ఎలాంటి ఇతర కోణం లేదని పోలీసులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే నిందితులపైనా పోలీసులు మానవత్వం చూపడం కొసమెరుపు.

కుమారుడి వైద్యం కోసం రాగా..

- కామారెడ్డి జిల్లా కొత్తాబాద్ తండాకు చెందిన కె.మమత, కూరగాయల వ్యాపారి శ్రీను దంపతులు. వీరికి గతంలో ఇద్దరు మగ పిల్లలు పుట్టినా హైపర్ విస్కోసిటీ సిండ్రోమ్ అనే జన్యుపరమైన వ్యాధితో చనిపోయారు. ఇటీవలే మమతకు మరో బాబు పుట్టాడు. పది రోజుల వయసున్న అతడికీ అదే వ్యాధి సోకిందని, బతికే అవకాశం లేదని వైద్యులు చెప్పారు. దీంతో ఓ మగ శిశువుని కిడ్నాప్ చేసి పెంచుకుందామని ఈ దంపతులు పథకం వేశారు. దీన్ని అమలులో పెట్టడంలో భాగంగా ఇద్దరూ కలిసి తమ చిన్నారితో గత గురువారం నగరానికి చేరుకున్నారు.
- గండిపేట్ రోడ్డు ప్రాంతానికి చెందిన ఫరీదా బేగానికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు (4) అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో ఆమె పెద్ద కుమారుడు, చిన్న కుమారుడిని (6 నెలలు) తీసుకుని కలిసి గత గురువారం ఉదయం నిలోఫర్ ఆస్పత్రికి వచ్చింది. పెద్ద కుమారుడిని తండ్రి వైద్యుల వద్దకు తీసుకువెళ్లగా.. ఫరీదా బేగం తన చిన కుమారుడితో కలిసి వెయిటింగ్ హాల్‌లో ఉంది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బాలుడు నిద్రించడంతో ఆమె బాలుడిని అక్కడే పడుకోపెట్టి ఆహారం కోసం బయటికి వెళ్లింది. అప్పటికే ఆమెతో మాటలు కలిపిన మమత తన కుమారుడి వైద్యం కోసం వచ్చానని చెప్పింది.

సొంతూరికి వెళితే అనుమానిస్తారని..

ఫరీదా తన చిన్న కుమారుడిని వదిలి వెళ్లడంతో అదను కోసం వేచి చూసిన మమత.. తన కుమారుడిని అక్కడే వదిలేసి ఆరు నెలల బాలుడిని తీసుకుని ఉడాయించింది. అక్కడ నుంచి ఆటోలో జూబ్లీబస్ స్టేషన్‌కు చేరుకోగా.. లక్డీకాపూల్ ప్రాంతంలో వేచి ఉన్న ఆమె భర్త శ్రీను బస్సులో వెళ్లాడు. అక్కడ కలుసుకున్న ఇద్దరూ కొన్నిరోజులు స్వగ్రామానికి వెళ్లకూడదని భావించారు. తమ పది రోజుల శిశువు స్థానంలో ఆరు నెలల బాలుడిని తీసుకువెళ్తే ఎవరైనా అనుమానిస్తారని, ఈ నేపథ్యంలో మరో ఆరు నెలలు బాన్సువాడలో తలదాచుకోవాలని నిర్ణయించుకున్నారు. బాన్సువాడలో ఉన్న తన స్నేహితుడి ద్వారా శ్రీను ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. గత శుక్రవారం నుంచి నిందితులు ఇద్దరూ కిడ్నాప్ చేసిన బాలుడితో అందులోనే ఉంటున్నారు. ఈ శిశువుకు మమత బ్రెస్ట్ ఫీడింగ్ ద్వారా పాలు ఇస్తూ జాగ్రత్తగా చూసుకుంది. వీళ్లు నిలోఫర్‌లో వదిలేసిన బాలుడిని అదే రోజు గుర్తించిన వైద్య సిబ్బంది నాంపల్లి ఠాణాలో ఫిర్యాదు చేయడంతో గుర్తుతెలియని నిందితులపై కేసు నమోదైంది. ఫరీదా ఫిర్యాదు మేరకు మరో కిడ్నాప్ కేసు రిజిస్టర్ చేశారు.



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

ముమ్మరంగా గాలించిన టాస్క్‌ఫోర్స్..

కేసును చాలెంజ్‌గా తీసుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్, ఎస్సై సీహెచ్ నవీన్‌కుమార్ తదితరులు రంగంలోకి దిగారు. నిలోఫర్ నుంచి ఓ చిన్నారి కిడ్నాప్ కావడం, అదే రోజు మరో చిన్నారి దొరకడంతో ఈ రెంటికీ మధ్య లింకు ఉంటుందని అనుమానించారు. నిలోఫర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితులు బాన్సువాడలో ఉన్నట్లు గుర్తించారు. బుధవారం మమత దంపతులను అదుపులోకి తీసుకుని బాలుడిని రెస్క్యూ చేసి కన్నతల్లి ఫరీదాకు అప్పగించారు. ఈ కేసులో పోలీసులు నిందితులపైనా మానవత్వం కనబరిచారు. మమత కుమారుడికి ప్రస్తుతం నిలోఫర్‌లోనే చికిత్స జరుగుతోంది. దాన్ని తామే పర్యవేక్షిస్తామని డీసీపీ వెంకటేశ్వర్లు ప్రకటించారు. అవసరమైతే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ఈ చిన్నారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉండటంతో తల్లిదండ్రులైన నిందితులను రిమాండ్‌కు తరలించకూడదని నిర్ణయించారు.ఇరువురికీ నోటీసులు జారీ చేస్తున్నామని, వారి చిన్నారి పూర్తిగా కోలుకున్నాకే కిడ్నాప్, శిశువుని వదిలేసిన కేసుల్లో అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మంత్రి సబితకు అండగా నిలుద్దాం

- హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలని పిలుపు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మహమూద్‌అలీ, సబితారెడ్డి

పహాడీషరీఫ్: నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి సబితారెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం ఆయన మంత్రి సబిత కలసి జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీషరీఫ్ ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. 14 ఏళ్ల పాటు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలన్నారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. వంద కోట్ల రూపాయలతో జల్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పను లు జరుగుతున్నాయన్నారు. మరో రూ. 25కోట్లకు సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని వివరించారు. రూ.14 కోట్ల వ్యయంతో చారిత్రాత్మకమైన పహాడీషరీఫ్ దర్గా పైకి ర్యాంప్ నిర్మిస్తున్నామన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

మంత్రి ఔదార్యం..

మహేశ్వరం: స్కూల్ నుంచి కాలినడకన ఊరికి వెళుతున్న ఇద్దరు విద్యార్థినులను మంత్రి సబిత తన కారులో ఇంటికి చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గొల్లూరు తండాకు చెందిన ముడావత్ పల్లవి, ముడావత్ నందినీ అక్కాచెల్లెల్లు. వీరు గొల్లూరు ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నారు. గొల్లూరు – గొల్లూరు తండాకు కిలో మీటరు దూరం ఉంటుంది. బుధవారం స్కూలు ముగిసిన తరవాత విద్యార్థినులు కాలినడకన ఇంటికి బయలు దేరారు. అదే సమయంలో గొల్లూరు నుంచి పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వైపు వెళుతున్న మంత్రి సబితారెడ్డి నడిచి వెళుతున్న విద్యార్థినులను చూశారు. తన వాహనాన్ని ఆపి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఏం చదువుతున్నారు? ఒక్కడికి వెళ్లాలి? తన కారులో వస్తారా అని అడిగారు. అనంతరం చిన్నారులను తన కారులో ఎక్కించుకొని వారికి చాక్లెట్లు ఇచ్చి గొల్లూరు తండాలోని వారి ఇంటి వద్ద దింపారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. మంత్రి స్వయంగా తన కారులో తమ పిల్లలను ఎక్కించుకుని ఇంటి వద్ద దింపడంతో తల్లిదండ్రులు, తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారులతో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం



సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా నేతలు, ప్రజాప్రతినిధులు

- తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు బహుమతిగా ఇద్దాం
- కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ

ఇబ్రహీంపట్నం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియమ్మకు బహుమతిగా ఇద్దామని ఆ పార్టీ మహిళా నేతలు, ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా నినదించారు. తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ స్కీమ్‌లపై బుధవారం ఇబ్రహీంపట్నంలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్లు స్రవంతి, హార్థిక, అనూరాధ, అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీపీ రేఖ, కౌన్సిలర్లు మంగమ్మ, మమత, పార్టీ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు మల్లిక మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబంలోని మహిళకు నెలకు రూ. 2,500ల నగదు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం తదితర పథకాలను అమలు పరుస్తామని సోనియా గాంధీ ప్రకటించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు హరిత, జ్యోతి, మాధవి, శిల్ప, రత్నకుమారి, సంతోష, ఉమా, లక్ష్మి, భాను, ఐలమ్మ, యాదమ్మ, సుకన్య, అండాలు, అమృత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాల్సిందే

- లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతాం
- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి
- కలెక్టరేట్ ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- ఇరువురి మధ్య తోపులాట
- పలువురికి గాయాలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాలోని అంగన్‌వాడీలు, కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా చేశారు. అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, నాయకులు కిషన్, రవికుమార్, లక్ష్మికి గాయాలయ్యాయి. వీరిని తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకొని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ ఎదుట అంగన్‌వాడీలు రోడ్డుపై బైఠాయించి అరెస్టు చేసిన వారిని విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ..ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూ నియన్ జిల్లా కార్యదర్శి కవిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి యాదయ్య, అధ్యక్షుడు పర్వతాలు, అంగన్‌వా డీ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి,నాయకులు కిషన్, రవి, బుగ్గ రాములు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశను నాశనం చేసుకోవద్దు


అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీస్ సిబ్బంది

షీటీం ఎస్ఐ శ్రీనువాసులు

యాచారం: విద్యార్థి దశ ఎంతో విలువైందని, ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదుకోవాలని షీటీం ఎస్ఐ శ్రీనువాసులు విద్యార్థులకు సూచించారు. మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మహిళల రక్షణపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 కాల్ చేయడం, స్థానిక పోలీసులకు ఫిర్యాదు, ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి..

సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలు, తండాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని మేడిగడ్డతండాలో బుధవారం రాఘువేందర్‌రెడ్డి పర్యటించి గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో మేడిగడ్డ తండాలో పర్యటించిన సమయంలో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షలు విరాళం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మొదటి విడతగా గతంలో రూ.1.50 లక్షలు ఇవ్వగా బుధవారం మరో రూ.1.50 లక్షలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాదికాలంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి ప్రవేశించానని ప్రజలు ఆశీర్వదిస్తే మరింత సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, స్థానిక నాయకులు తావుర్యా, చంద్రియ, లోక్యానాయక్, చంద్రునాయక్, పత్యానాయక్, కుమార, భవన్, సుభాష్, ప్రభాస్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న రాఘువేందర్‌రెడ్డి

నేల క్షీణతతో జీవకోటికి ముప్పు

- భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే
- మంత్రి నిరంజన్‌రెడ్డి
- కాన్హాలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

నందిగామ: నేల క్షీణతను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లేకుంటే జీవకోటికి ముప్పు తప్పదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. నందిగామ మండలం కాన్హా శాంతివనంలో మూడు రోజుల పాటు జరగనున్న ఆసియా, పసిఫిక్ రీజినల్ కాన్ఫరెన్స్ (మట్టి, ఆరోగ్యం, వాతావరణంలో మార్పులు, ఆహార భద్రత) 4 ఫర్ 1000 కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నేల క్షీణత ప్రబలంగా ఉందని, ఇందుకు సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే ఆందోళన కలగక తప్పదని పేర్కొన్నారు. దీంతో ఆహార భద్రత, పర్యావరణ స్థిరత్వానికి తీవ్రమైన ముప్పు వాటిల్లిందని తెలిపారు. సమష్టి కృషితో నేలను రక్షించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపై భూమి, ఆరోగ్యంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూమికి నష్టం కలిగించే పనులు ఎట్టి పరిస్థితుల్లో చేయవద్దని సూచించారు. చెట్లు, జీవరాశులను సంరక్షించుకోవాలంటే భూమిని కాపాడుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. రైతులు సైతం రసాయన ఎరువులను వాడడం తగ్గించాలని సూచించారు. మట్టి బాగుంటేనే సూక్ష్మజీవులు, కీటకాలు, పక్షులు, జీవరాశులు బాగుంటాయని పేర్కొన్నారు. అవి బాగుంటేనే మనం బాగుంటామని వివరించారు. రైతులు పంటల మార్పిడి విధానం చేపట్టాలని, సాంప్రదాయక వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలన్నారు. దీంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. ఆకుపచ్చ దేశం కోసం అడవులను సంరక్షించుకోవాలని సూచించారు. కాన్హా శాంతి వనంలో పచ్చని వాతావరణం చూస్తే భూమి ని ఏ విధంగా కాపాడుకోవచ్చో ఇట్టే అర్థం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ గురూజీ గ్లోబల్ గైడ్ దాజీ, ఫిజీ దేశ గ్రామీణ, సముద్ర అభివృద్ధి, విపత్తు నిర్వహణ మంత్రి సకీయాసీ రాల్సేవు డిటోకా, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ థియరి బెర్తెలోట్, డాక్టర్ పాల్‌లూ, 4 ఫర్ 1000 ఇనియేటివ్ కార్య నిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు, 18 దేశాలకు చెందిన వ్యవసాయ మంత్రిత్వ శాఖల అధికారులు, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో గురూజీ దాజీ, మంత్రి నిరంజన్‌రెడ్డి,పలు దేశాల వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు

భర్తను రోకలితో మోది హత్య

కొత్తూరు: మద్యానికి బానిసై రోజూ వేధిస్తున్నాడనే కారణంతో భర్తను భార్య రోకలితో మోది హత్య చేసింది. సీఐ శంకర్‌రెడ్డి వివరాలు.. పెంజర్లకు చెందిన నర్సింహులు(50), నర్సమ్మ దంపతులు, నర్సింహులు కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై భార్యను వేధిస్తున్నాడు. విచక్షణ కోల్పోయిన భార్య భర్తపై రోకలి, రాళ్లతో దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదైంది.

మహిళా బిల్లు ఆమోదించాలి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందితే రాజకీయంగా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. దీంతో మహిళా రక్షణ, విద్య, వైద్యం లాంటి అంశాల్లో విలువైన చర్చలకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్రం అఫీషియల్‌గా ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో లబ్ది కోసమే మహిళా బిల్లును ప్రస్తుతం తీసుకువచ్చిందన్నారు. బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. చట్టం సమర్థ అమలుకు తక్షణమే కుల గణన చేపట్టాలని పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతి రోజున ఎంబీసీలకు రూ. 2 లక్షల రుణం బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. బ్యాంక్ షూరిటీ, వడ్డీ లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 13,000 కోట్లుకు 8 శాతం వడ్డీలతో ఇస్తాననడం దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేతి వృత్తులకు వడ్డీ లేకుండా, పూర్తి సబ్సిడీతో రూ. లక్ష లబ్దిదారులకు అందజేస్తుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే బ్యాంక్‌ల ద్వారా కాకుండా పూర్తి సబ్సిడీతో లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, రైతు కమిటీ మండల కో ఆర్డినేటర్ నర్సింహ, లక్ష్మీనారాయణగౌడ్, జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

వ్యక్తి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామశివారు జాతీయ రహదారిపై వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బుధవారం చోటు చేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ పట్టణం, అప్పనపల్లికి చెందిన కుమ్మరి రాఘవులు(35) గత కొన్ని నెలలుగా హైదరాబాద్ పట్టణ సమీపంలోని శివరాంపల్లి పరిసరాల్లో తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా, మంగళవారం రాత్రి పనికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి శివరాంపల్లి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ శివారులో వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాఘవులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

డ్రగ్స్ రవాణా ముఠా అరెస్ట్

పహాడీషరీఫ్: అంతరాష్ట్ర డ్రగ్ రవాణా చేస్తున్న ముఠాను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మహారాష్ట్రకు చెందిన ఇద్దరు డ్రగ్ సరఫరాదారులు హైదర్ ఎక్బాల్ సిద్దిక్ మక్వా(35), ముస్తాక్ షేక్(35), పహాడీషరీఫ్‌కు చెందిన డ్రగ్ పెడ్లర్ సయ్యద్ జావెద్(50) డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న టీఎస్ నాబ్ అధికారులు, పహాడీషరీఫ్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7 లక్షల విలువైన 1030 గ్రాముల చరాస్, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కుక్కర్ పేలి ముగ్గురికి గాయాలు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీకాంత్ కాలనీలో ప్రెషర్ కుక్కర్ పేలి ముగ్గురు మహిళలకు గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాంత్‌కాలనీలో నెలకొల్పిన గణనాథుని మండపం వద్ద మంగళవారం రాత్రి అన్నదాన కార్యక్రమానికి వంటలు వండుతున్నారు. ఈ క్రమంలో వంటమనిషి పప్పును కుక్కర్‌లో ఉంచి ఉడికిస్తుండగా కుక్కర్ విజిల్ రాకపోవడంతో మూత తీసే ప్రయత్నం చేయగా కుక్కర్ మూత ఎగిరిపడింది. దీంతో అక్కడే ఉన్న వంటమనిషి, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. మండప నిర్వాహకులు, కాలనీవాసులు వీరిని ఆస్పత్రికి తరలించారు.

అనుమతులు ఇప్పించండి

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సురక్షితమైన మంచి నీరు అందించడానికి నూతన పైపులైన్‌ను వేయనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం జాతీయ రహదారి వెంబడి త్వవకాలు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారుల నుంచి అనుమతులు ఇప్పించాలని కోరుతూ హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ త్వరలో ఆర్అండ్‌బీ అధికారులతో అనుమతులు వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, కౌన్సిలర్ రవినాయక్, నాయకులు సప్పిడిరాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని కలిసిన హెచ్ఎండబ్ల్యూస్ అధికారులు, నాయకులు

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం


అవగాహన కార్యక్రమంలో జయలక్ష్మి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ జయలక్ష్మి

కొత్తూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ జయలక్ష్మి సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని ఎస్‌బీపల్లి, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన హెల్త్ మేళా కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. అనంతరం గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహారం, వ్యాక్సినేషన్లు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామాలు, యోగా చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు హరికిషన్, మానస, సిబ్బంది శ్రీనివాసులు, చిట్టిబాబు, రామ్‌నాయక్, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

ఇబ్రహీంపట్నం: దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని రాష్ట్ర యాంటి నార్కోటిక్స్ బ్యూరో పోలీస్ సూపరింటెండెంట్ సునీతారెడ్డి, టీఎస్ఏఎన్‌బీ ఎస్పీ చక్రవర్తి పేర్కొన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం గురునానక్ విద్యాసంస్థలో యాంటి డ్రగ్స్‌పై అవేర్‌నెస్ ప్రొగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొరుగు శత్రుదేశాలు దేశంలోని యువతను నిర్వీర్యం చేస్తే దేశ భవిష్యత్తు నాశనమవుతోందని మాదకద్రవ్యాలకు, మత్తు మందులకు బానిసలుగా మార్చుతున్నారని వెల్లడించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి 'మిషన్ పరివర్తన్' తీసుకురావడమే లక్ష్యమన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ఏఎన్‌బీ డీఎస్పీలు సుబ్బరామిరెడ్డి, రమేష్, సీఐ శ్రీనివాస్, గురునానక్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

దౌల్తాబాద్: చిరుధాన్యాలను తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల, సర్పంచు బసమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోకఫస్లాబాద్, బాలంపేట గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన పోషణ్ అభియాన్ మాసంలో గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వం సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, శ్రీదేవి, హెల్పర్లు భీమమ్మ, నారందమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. నల్గోండ జిల్లా, చందంపేట మండలం , ముడిదండ్ల గ్రామానికి చెందిన జల్లెల రాములు గంగిరెద్దులు ఆడించి జీవించేవాడు. గత పది రోజుల క్రితం కొంగరకలాన్ గ్రామానికి వచ్చాడు. కొద్ది రోజులుగా మూర్ఛవ్యాధితో రాములు ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం రాత్రి నిద్రలోనే మరణించాడు. నోట్లో నుంచి నురగ వచ్చి పడిపోగా గ్రామానికి చెందిన కాకి రవి అనే వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఆస్పత్రికి తరలించగా రాములు (51) మరణించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠాఅరెస్టు

8 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

ఆమనగల్లు: మాడ్గుల, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేస్తున్నా అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరి సభ్యులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు మాడ్గుల సీఐ జి.రాజశేఖర్ తెలిపారు. మాడ్గుల పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. మాడ్గుల మండలం నర్సాయిపల్లి గ్రామ సమీపంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా పలు దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. మహబూబాబాద్ జిల్లాకు చెందిన దాసరి నర్సయ్య, దాసరి నరేశ్, మరో ముగ్గురు కలిసి గత నెలలో మాడ్గుల మండలం కొల్కులపల్లిలో అర్ధరాత్రి వృద్ధురాలు సత్తెమ్మను కట్టివేసి బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారని చెప్పారు. పట్టుబడిన ఇద్దరి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన ముఠాసభ్యులు గతంలో ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడగా 8 కేసుల్లో ఉన్నారని, వీరిపై రాష్ట్ర వ్యాప్తంగా 40 కేసులు నమోదయ్యాయని సీఐ వివరించారు.

డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలి

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్


రమేష్

మంచాల: డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అదనంగా రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపి న్యాయం చేయాలన్నారు. డీఎస్సీ–2023లో చేపడుతున్న నియమాకాల్లో చాలా తక్కువ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన 13వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ సవరించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక్క ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆడుకుంటూ వెళ్లి.. అనంత లోకాలకు

- సిమ్మింగ్‌పూల్‌లో పడి ఐదేళ్ల బాలుడు మృతి
- చేవెళ్ల మండలం కుమ్మెరలో ఘటన


బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

చేవెళ్ల: ఐదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమ్మెరలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఫాతిమా ఫాంహౌస్‌లో స్థానికులైన బోసగిరి సుధాకర్, శ్రీలత దంపతులు పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. రోజూ మాదిరిగానే భార్యాభర్తలు పిల్లలను తీసుకొని ఫాంహౌస్‌లోకి వెళ్లారు. వీరు పనిలో ఉండగా.. ఆడుకుంటూ స్విమ్మింగ్‌పూల్ వైపు వెళ్లిన చిన్న కొడుకు రామకృష్ణ (5) అందులో పడిపోయాడు. ఇది గమనించిన పెద్ద కుమారుడు ఏడ్చుకుంటూ వెళ్లి తల్లిదండ్రులకు చెప్పాడు. వారు వచ్చి బయటకు తీసేసరికి చిన్నారి మృతిచెందాడు. కళ్ల ముందే కదలాడిన కొడుకు మరణంతో వారి రోదనలు మిన్నంటాయి. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.